# మణిద్వీపవర్ణన

1. మహాశక్తి మణిద్వీప నివాసిని ముల్లోకాలకు మూల ప్రకాశిని
మణిద్వీపములో మంత్రరూపిణి మన మనస్సులలో
కొలువైయుంది||

2. సుగంధ పరిమళ పుష్పాలెన్నో వేలు అనంత సుందర సువర్ణపూలు
అచంచలంబగు మనోసుఖాలు మణి ద్వీపానికి మహానిధులు||

3. లక్షల లక్షల లావణ్యాలు అక్షర లక్షల వాక్ సంపదలు
లక్షల లక్షల లక్ష్మీపతులు మణిద్వీపానికి మహానిధులు||

4. పారిజాత వన సౌగంధాలు సురాధినాధుల సత్సంగాలు
గంధర్వాదుల గాన స్వరాలు మణిద్వీపానికి మహానిధులు
భువనేశ్వరీ సంకల్పమే జనియించే మణిద్వీపం
దేవదేవుల నివాసము అదియే కైవల్యం||

5. పద్మరాగములు సువర్ణమణులు పదిఆమడల పొడవున గలవు
మధుర మధురమగు చందన సుధలు మణిద్వీపానికి
మహానిధులు||

6. అరువది నాలుగు కళామతల్లులు వరాలనొసగే పదారుశక్తులు
పరివారముతో పంచబ్రహ్మలు మణిద్వీపానికి మహానిధులు||

7. అష్టసిద్ధులు నవనవ నిధులు అష్టదిక్కుల దిక్పాలకులు
సృష్టికర్తలు సురలోకాలు మణిద్వీపానికి మహానిధులు||

8. కోటి సూర్యుల ప్రచండకాంతులు కోటిచంద్రుల చల్లని వెలుగులు
కోటి తారకల వెలుగు జిలుగులు మణిద్వీపానికి మహానిధులు||

9. కంచుగోడల ప్రాకారాలు రాగిగోడల చతురస్రాలు
ఏడామడల రత్నరాసులు మణి ద్వీపానికి మహానిధులు||

10. పంచామృతమయ సరోవరాలు పంచలోహమయ ప్రాకారాలు
ప్రపంచమేలే ప్రజాధిపతులు మణి ద్వీపానికి మహానిధులు||

11. ఇంద్రనీలమణి ఆభరణాలు వజ్రపు కోటలు వైఢూర్యాలు
పుష్యరాగమణి ప్రాకారాలు మణి ద్వీపానికి మహానిధులు||

12. సప్తకోటి ఘన మంత్రవిద్యలు సర్వశుభప్రద ఇచ్చాశక్తులు
శ్రీగాయత్రీ జ్ఞానశక్తులు మణి ద్వీపానికి మహానిధులు||

13. మిలమిలలాడే ముత్యపురాసులు తళతళలాడే చంద్రకాంతములు
విద్యుల్లతలు మరకతమణులు మణిద్వీపానికి మహానిధులు||

14. కుబేర ఇంద్ర వరుణదేవులు శుభాలనొసగే అగ్నివాయువులు
భూమి గణపతి పరివారములు మణిద్వీపానికి మహానిధులు||

15. భక్తి జ్ఞాన వైరాగ్యసిద్ధులు పంచభూతములు పంచశక్తులు

సప్తఋషులు నవగ్రహాలు మణిద్వీపానికి మహానిధులు||

16. కస్తూరి మల్లిక కుందవనాలు సూర్యకాంతి శిలమహాగ్రహాలు

ఆరు ఋతువులు చతుర్వేదాలు మణిద్వీపానికి మహానిదులు||

17. మంత్రిణి దండిని శక్తిసేనలు కాళికరాళి సేనాపతులు

ముప్పది రెండు మహాశక్తులు మణిద్వీపానికి మహానిధులు||

18. సువర్ణరజిత సుందరగిరులు అనంతదేవీ పరిచారికలు

గోమేధికమణి నిర్మిత గుహలు మణిద్వీపానికి మహానిధులు||

19. సప్తసముద్రములనంత నిధులు యక్షకిన్నెర కింపురుషాదులు

నానాజగములు నదీనదములు మణిద్వీపానికి మహానిధులు||

20. మానవ మాధవ దేవగణములు కామధేనువు కల్పతరువులు

సృష్టిస్థితిలయ కారణమూర్తులు మణిద్వీపానికి మహానిధులు||

21. కోటి ప్రకృతుల సౌందర్యాలు సకలవేదములు ఉపనిషత్తులు

పదారు రేకుల పద్మశక్తులు మణిద్వీపానికి మహానిధులు||

22. దివ్య ఫలములు దివ్యాస్త్రములు దివ్య పురుషులు ధీరమాతలు

దివ్య జగములు దివ్య శక్తులు మణిద్వీపానికి మహానిధులు||

23. శ్రీ విఘ్నేశ్వర కుమారస్వాములు జ్ఞానముక్తి ఏకాంత భవనములు
మణి నిర్మితమగు మండపాలు మణిద్వీపానికి మహానిధులు||

24. పంచభూతములు యాజమాన్యాలు ప్రవాళసాలం అనేకశక్తులు
సంతాన వృక్ష సముదాయాలు మణిద్వీపానికి మహానిధులు||

25. చింతామణులు నవరత్నాలు నూరామడల వజ్రపురాసులు
వసంతవనములు గరుడపచ్చలు మణిద్వీపానికి మహానిధులు||

26. ధుఃఖము తెలియని దేవీసేనలు నటనాట్యాలు సంగీతాలు
ధనకనకాలు పురుషార్ధాలు మణిద్వీపానికి మహానిధులు||

27. పదునాలుగు లోకాలన్నిటిపైన సర్వలోకమను లోకము గలదు
సర్వలోకమే ఈ మణిద్వీపము సర్వేశ్వరికది శాశ్వతస్థానం ||

28. చింతామణుల మందిరమందు పంచబ్రహ్మల మంచముపైన
మహాదేవుడు భువనేశ్వరితో నివసిస్తాడు మణిద్వీపములో||

29. మణిగణ ఖచిత ఆభరణాలు చింతామణి పరమేశ్వరి దాల్చి
సౌందర్యానికి సౌందర్యముగా అగుపడుతుంది మణిద్వీపములో||

30. పరదేవతను నిత్యము కొలిచి మనసర్పించి అర్చించినచో
అపారధనము సంపదలిచ్చి మణిద్వీపేశ్వరి దీవిస్తుంది||2||

31. నూతన గృహములు కట్టినవారు మణిద్వీప వర్ణన తొమ్మిదిసార్లు
చదివిన చాలు అంతా శుభమే అష్టసంపదల తులతూగేరు||2||

32. శివకవితేశ్వరి శ్రీ చక్రేశ్వరి మణిద్వీప వర్ణన చదివినచోట
తిష్ట వేసుకొని కూర్చొనునంటా కోటి శుభాలను సమకూర్చుకొనుటకై
భువనేశ్వరీ సంకల్పమే జనియించే మణిద్వీపం
దేవదేవుల నివాసము అదియే కైవల్యం||